నిర్వహణ గాలికొదిలేశారు!

- కంపుకొడుతున్న సామాజిక మరుగుదొడ్లు
- నీటి సౌకర్యం లేక ఇక్కట్లు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు


సరంగడోల వీధిలోని సామాజిక మరుగుదొడ్డిలో పాడైన సింక్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర పరిధిలోని సామాజిక మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. నిర్వహణను గాలికొదిలేయడంతో అధ్వానంగా మారాయి. దమ్మలవీధి సమీపంలోని సరంగడోల వీధి, 40వ డివిజన్‌లో సామాజిక మరుగుదొడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డే అండ్ నైట్, ఆదివారంపేట, పీఎస్ఎన్ఎం స్కూల్ సమీపంలో ఉన్న వాటితో పాటు నగరంలో అన్నిచోట్ల దుర్గంధ భరితంగా మారాయి. దీంతో అటువైపుగా వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వాటికి సమీపంలో ఉన్న ఇళ్ల వారు నరకయాతన అనుభవిస్తున్నారు. సామాజిక మరుగుదొడ్లకు ఎదురుగానే మున్సిపల్ స్కూల్ ఉండడంతో దుర్వాసనకు తరగతి గదుల్లో ఉండలేకపోతున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరుగుదొడ్లలో కనీస సౌకర్యాలైన నీరు, ట్యాప్‌లు, ఫినాయిల్, బాత్‌రూమ్‌లకు తలుపులు కూడా లేవు. మరోవైపు మందుబాబులు, మత్తుబాబులు కూడా వీటిని తమ అడ్డాగా మార్చుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

బహిరంగ మలమూత్రవిసర్జన వల్ల రోగాలు వచ్చే అవకాశముందని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణ, నీటి సౌకర్యం కల్పించే బాధ్యతలు ఓ ప్రయివేటు వ్యక్తికి అప్పగించారు. అప్పట్లో ఎక్కడ చూసినా సామాజిక మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేవి. శానిటేషన్ సిబ్బంది కూడా ప్రతి రోజూ వాటిని శుభ్రం చేసి స్థానికులు వాడుకునేలా చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి గాలికొదిలేశారు. పూర్తిగా వాటి నిర్వహణ గాలికొదిలేశారు.


అధ్వానంగా సామాజిక మరుగుదొడ్డి ఆవరణ

బాగుచేయాలి..



సామాజిక మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచడం లేదు. నీరు కూడా రావడం లేదు. తలుపులు సరిగా లేవు. అధికారులు స్పందించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

– కొమర కమల, దమ్మలవీధి, శ్రీకాకుళం నగరం

చర్యలు తీసుకుంటాం..



సామాజిక మరుగుదొడ్ల నిర్వహణపై దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపడతాం. నగరంలో అన్ని చోట్లా ఉన్న సామాజిక మరుగుదొడ్లను పరిశుభ్రం చేయిస్తాం.

– పి.వి.వి.డి ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి వీఆర్వోలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు .రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు భూపతి నర్సింగరావు, జగన్నాథం, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

117 జీఓను రద్దు చేయాలి


మాట్లాడుతున్న సన్యాసిరావు

జి.సిగడాం: ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని తక్షణమే రద్దు చేయాలని డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు తమ్మినేని సన్యాసిరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఆనందపురం యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యపై చర్చించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే ఆమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 117 జీఓను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం అమలు చేయాలన్నారు. మండల శాఖ నాయకులు శిల్లా భాస్కరరావు, గురుగుబిల్లి శ్రీరామదత్త, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్మోహన్


ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అసంపూర్తి ఇళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పీపీఎస్ రామ్మోహన్ తెలిపారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అసంపూర్తి ఇళ్లు పూర్తిచేసేలా లబ్ధిదారులకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాలువలు శుభ్రంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ప్రాధాన్యత గల ఉపాధి హామీ పథకం పనుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి హామీ ఏపీఓ శోభాదేవి, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జైలుకు టీవీలు బహూకరణ


సూపరింటెండెంట్‌కు టీవీలను అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్/గార: విశాఖకు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గురువారం జిల్లా జైలుకు రెండు టీవీలను బహూకరించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ తన తండ్రి కుప్పిలి త్రినాథరావు జ్ఞాపకార్థం టీవీలు వితరణ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఖైదీలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, జైలర్ ఉదయ్‌భాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ, లక్ష్మణరావు, ఇస్కాన్ ప్రతినిధి ఉరిటి సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు విశ్రాంత ఏఈ గౌరీశంకర్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో న్యాయ సదస్సు


ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

గార: జైలులో ఉన్న ముద్దాయిలకు న్యాయ సలహాలు అందించేందుకే అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. గురువారం జైలులో న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ సలహాలు అందించేందుకు న్యాయవాదిని అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం ఖైదీల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, సూపరింటెండెంట్ సన్యాసిరావు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబ సభ్యులకు పరామర్శ


మృతి చెందిన విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


గాయపడిన విద్యార్థి శ్రీరామ్‌ను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వనుం కృష్ణంరాజు ప్రమాదవశాత్తు సన్‌స్లేడ్ కూలి మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో విద్యార్థి శవ పంచనామా విషయమై ఎస్సై చిరంజీవితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

గాయపడిన విద్యార్థికి..

ఇదే ప్రమాదంలో గాయపడిన కోరాడ శ్రీరామ్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విద్యార్థిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి..

నెలివాడ గ్రామానికి చెందిన ఎందువ సింహాచలం బుధవారం రణస్థలం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుని బంధువులను రిమ్స్ వద్ద పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, నాయకులు రెడ్డి విశ్వేశ్వరరావు, పిన్నింటి సాయిచరణ్, మహంతి వెంకటప్పలనాయుడు, బెల్లపు అప్పలనాయుడు, పతివాడ సత్యం, పతివాడ శ్రీరామమూర్తి, బొంతు జగన్నాథం, రెడ్డి లక్ష్మణ, సత్యనారాయణ, బంగారు తాత, పతివాడ సత్యం, మంత్రి సోమినాయుడు, వీఆర్వో జగన్నాథం, నెలివాడ సింహాచలం తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్‌ను తప్పించడానికే లడ్డూ కథ


మాట్లాడుతున్న పేడాడ శ్రీరామ్మూర్తి

జి.సిగడాం: ఎన్నికల ముందు ప్రజలకు లేనిపోని హామీలను ఇచ్చి గద్దె ఎక్కిన సీఎం చంద్రబాబు.. సూపర్ సిక్స్ పథకాలను తప్పించడానికే తిరుపతి లడ్డూ కథ తెరపైకి తెచ్చారని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తి అన్నారు. గురువారం విజయరాంపురం, దవలపేట గ్రామాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హయంలో పేదల కోసం ఒక్క పథకం కూడా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. 100 రోజుల పాలనలో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందనే ఆలోచనతో తిరుపతి లడ్డూపై లేనిపోని ప్రచారం చేస్తున్నారన్నారు. మడ్డువలస కాలువ ద్వారా పంట పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జగనన్న హయాంలో అర్హులైన లబ్ధిదారులకు అనేక సంక్షేమ ఫలాలను అందించడం జరిగిందన్నారు. సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు కంచరాన రమణారావు, పేడాడ శ్యామలరావు, పేడాడ కృష్ణంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినూత్న నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న లావేరు సివిల్ సప్లయ్ గొడాం కార్మికులు

ఎచ్చెర్ల: సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల కూలీ రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని కోరుతూ లావేరు మండల పౌర సరఫరాల గొదాం హమాలీలు గురువారం లావేరు గొదాం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సివిల్ సప్లయ్ హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ జీఓను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా లావేరు ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. రెక్కలు కష్టానికి తగ్గ కూలీ రేట్లు ప్రభుత్వం అందించక కుటుంబాలతో అర్ధాకలితో అలమటిస్తున్న హమాలీ కార్మికులకు తక్షణమే కూలీ రేట్ల అగ్రిమెంట్ జీఓ విడుదల చేసి అమలు చేయాలన్నారు. 20వ తేదీ తరువాత ఇస్తున్న కూలీ రేట్ల బిల్లులు ప్రతీనెలా పదో తేదీలోగా హమాలీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల కుదింపు ఆపి పాత పద్ధతిలోనే సరుకులు రవాణా చేయాలన్నారు. హమాలీలు గంగి గౌరి, పసుపురెడ్డి భుజంగరావు, జగది, బారుకల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలు స్వరనీరాజనం


విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సిక్కోలు ఫ్యూచర్ సింగర్స్ ఆధ్వర్యంలో బాలు స్వరనీరాజనం–4 కార్యక్రమం గురువారంతో ముగిసింది. ప్రముఖ సినీ గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఔత్సాహిక గాయకులకు పోటీలు నిర్వహించగా 40 మంది పాల్గొన్నారు. వీరిలో గెలుపొందిన కె.భవ్య, డి.చంటి, ఎల్.చార్మిలు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. సూపర్ సింగర్ తుంగాన వేంకటేష్, కె.ఎల్.ఎస్.మూర్తి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. డీఎస్పీ వివేకానంద విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హారికా ప్రసాద్, లయన్స్ హర్షవిల్లి ప్రెసిడెంట్ వి.జగన్నాథంనాయుడు, మణిశర్మ, ఉషారాణి, పొందూరు వెంకటరమణ, గాయకులు కాళ్లకూరి మధుకుమార్, సాయిబాబా, రాజమోహన్, మార్గదర్శి శ్రీను, కల్యాణం రామ్మోహన్‌రావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో చిలకపాలెం, కొయ్యాం, ధర్మవరం, పొన్నాడ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం మరమ్మతుల నిర్వహణ చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ధర్మవరం, కొయ్యాం, కేకేనాయుడుపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి, బడివానిపేట, నిమ్మవానిపేట, భగీరథపురం, పొన్నాడ, ముద్దాడ గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఈ గంటలు వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

28న బాలు వర్ధంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: ఘంటసాల, బాలు, జి.ఆనంద్(జి.బి.ఎ) స్వరమాధురి వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (బాలు) వర్ధంతి సభా కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ నిక్కు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు లోకనాథం రామలింగస్వామికి సత్కారం, బండారు చిట్టిబాబు సంగీత సారథ్యంలో సినీ స్వరమాధురి ఉంటుందని పేర్కొన్నారు. అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

శ్రీకాకుళం డివిజన్ ఆపరేషన్స్ ఈఈగా యోగేశ్వరరావు

అరసవల్లి: విద్యుత్ శాఖ శ్రీకాకుళం డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా పైడి యోగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన ప్రస్తుతం పలాస డివిజన్ ఆపరేషన్స్ ఈఈగా విధుల్లో ఉన్నారు. ఇప్పటివరకు ఈఈగా పనిచేసిన సత్తారు బయ్యన్నాయుడు.. ఇదే సర్కిల్‌లో ఎంఆర్‌టీ విభాగ ఈఈగా బదిలీ చేశారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

ఎచ్చెర్ల: చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని జేవీవీ పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ పూజారి గోవిందరావు తెలిపారు. గురువారం లావేరు మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. ప్రథమ స్థానం సాధించిన ముగ్గురు విద్యార్థులు అక్టోబర్ 1వ తేదీన జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, ఎం.అనురాధ, కె.వైకుంఠరావు, పడాల తమ్మినాయుడు, కూన చిన్నపెంటయ్య, ఎస్.రమేష్‌బాబు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్వచ్ఛభారత్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కాంప్లెక్స్‌లోని మరుగుదొడ్లు, టాయ్‌లెట్లు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఎచ్చెర్ల: మొక్కలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం బెజ్జిపురంలో ఉపాధి సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన వనం–మనం కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

తొలగిన చెత్త సమస్య



చెత్త డబ్బాను ఏర్పాటు చేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగరంలోని విశాఖ ఎ–కాలనీ పరిసర ప్రాంతంలో ఎమ్మెల్యే గొండు శంకర్ క్యాంపు కార్యాలయం రోడ్డులో ఏర్పడిన చెత్త సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ యంత్రాంగం స్పందించి గురువారం చెత్తాచెదారాలను తొలగించి చెత్తబుట్టను ఏర్పాటు చేశారు. రోజులు తరబడి పేరుకుపోయిన చెత్తను తొలగించి పందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. కాలనీవాసులు చెత్తను వేసుకునేందుకు కొత్తగా చెత్తడబ్బాలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణ


ధ్రువపత్రాలు అందజేసిన రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్ : తోటివారి ప్రాణాలను రక్షించడానికి ప్రథమ చికిత్స శిక్షణ ప్రతి ఒక్కరికీ చాలా అవసరమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ శిక్షణాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన సీనియర్ ప్రొఫెషనల్స్ ఫస్ట్ ఎయిడ్ ట్రయినింగ్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ ఆధ్వర్యంలో సీపీఆర్, విపత్తుల సమయాలలో గాయాలకు కట్లు కట్టడం, పాము కాటు, తేలుకాటు, గుండెపోటు, కరెంటు షాక్, రోడ్డు ప్రమాదాలలో గాయపడినవారికి అందించాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. అనంతరం 30 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ఏఓ నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, కమిటీ సభ్యులు బి.చిన్మయరావు, పి.చైతన్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్లతో ఆర్థిక తోడ్పాటు


అర్బన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రమణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టణ స్వయం సహాయక సంఘాల ఆర్థిక తోడ్పాటుకు మెప్మా అర్బన్ మార్కెట్ల నిర్వహణ చేపడుతున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వి.రమణ తెలిపారు. గురువారం నగరంలోని రైతుబజార్ సమీపంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. స్వయం సహాయక సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసి, వారిలో నైపుణ్యతను, పోటీతత్వం పెంపొందించేకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం


మహిళా కళాశాలలో కూలిన విద్యుత్ స్తంభం

అరసవల్లి: నగరంలో గురువారం ఉదయం 11.30 నుంచి సుమారు గంట పాటు కురిసిన వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలు, వీధులు జలమయ్యాయి. మురుగునీటి కాలువలు పొంగిపొర్లాయి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పలు చెట్లు విరిగిపడగా.. ప్రధాన మార్గంలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఆదిత్యనగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, కామేశ్వరి నగర్ శ్రీశయన వీధి తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. గాలుల తీవ్రత కూడా అధికంగా ఉండడంతో విద్యుత్ సరఫరాను వెంటనే నిలిపివేశారు. వర్షం తగ్గిన తర్వాత విద్యుత్‌శాఖ అధికారులు ఏరియా సర్వే చేపట్టి, ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు, సమాచారాలను బట్టి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ఈయూ నేతలకు అభినందనలు


పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల బెంగళూరులో జరిగిన 18వ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ జాతీయస్థాయి మహాసభల్లో సంఘ జాతీయ ముఖ్య ఉపాధ్యక్షుడిగా ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావును, జాతీయ కార్యదర్శిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్యలను ఎన్నుకున్నారు. వీరికి ఈయూ తరపున అభినందనలు తెలియజేస్తున్నట్లు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. అభినందనలు తెలిపిన వారిలో ఈయూ నాయకులు ఎస్ఎస్ఆర్ శర్మ, కొర్లాం గణేష్, ఎస్.అప్పారావు, జి.త్రినాథ్, కె.బాబూరావు, కె.గోవిందరావు, జిల్లా కమిటీ, సిబ్బంది ఉన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం



సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పీఎస్‌లు, ఏఆర్ సిబ్బంది, ఇతర విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 32 మంది పోలీసుల శాఖాపరమైన, వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది బదిలీలు, సీనియారిటీ ప్రమోషన్లు, సరెండర్ లీవ్స్ మంజూరు, ఆదాయపు పన్ను రికవరీ, ఆరోగ్యపరమైన సమస్యలకు పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు.

విద్యుత్ ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం


సీఐ విజయనాథ్‌కు సూచనలిస్తున్న సీవీఓ రామకృష్ణ ప్రసాద్

అరసవల్లి: విద్యుత్ శాఖలో విజిలెన్స్ సిబ్బంది మరింత క్రమశిక్షణతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి (సివివో) కేవీ రామకృష్ణ ప్రసాద్ సూచించారు. ఆయన గురువారం తొలి పర్యటనగా విద్యుత్ విజిలెన్స్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సీఐ విజయనాథ్ సమక్షంలో మిగిలిన సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ చౌర్యం కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా విజిలెన్స్ సిబ్బంది పనిచేయాలని, ఈ మేరకు వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో గురువారం పాతపట్నం మండలంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మరణించడంపై విచారం వ్యక్తం చేసారు. వెంటనే ఘటనాస్థలానికి విజిలెన్స్ సిబ్బంది వెళ్లి పరిస్థితులను తెలుసుకుని నివేదిక పంపించాలన్నారు. ఈయన వెంట సీఐ విజయనాథ్ తదితరులున్నారు. తొలిసారిగా సీవీఓ రామకృష్ణ ప్రసాద్‌ను టెక్నికల్ ఈఈ జి.సురేష్‌కుమార్, పర్సనల్ ఆఫీసర్ ఎం.వి.రాజేశ్వరి, జేఏఓ మహంతి ప్రభాకరరావులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సంక్షిప్తంగా..

రక్తదానానికి స్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: రక్తదానాన్ని మించిన దానం మరొకటిలేదని బీజేపీ సీనియర్ నాయకులు పూడి తిరుపతిరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు, నరసన్నపేట నియోజకవర్గ కన్వీనర్ గొద్దు భాగ్యలక్ష్మి జన్మదినం సందర్భంగా గురువారం డే అండ్ నైట్ జంక్షన్‌లో ఉన్న విజయశ్రీ బ్లడ్ బ్యాంక్‌లో జీబీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్డి సూర్యప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, పి.సూర్యకుమారి, గొలివి కరుణాకర్, పూజారి చెల్లయ్య, సురేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఫైనాన్స్ కమిటీ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్)కళాశాలలో గురువారం 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫైనాన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, బీఆర్ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ బి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, ఆఫీసు సూపరింటెండెంట్ బి.లక్ష్మి పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నిర్మల అనే మహిళ ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. తలుపులు బద్దలగొట్టి ఇంట్లో ప్రవేశించిన దొంగలకు లోపల ఏమీ దొరక్కపోవడంతో పారిపోయారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి నష్టం జరగకపోవడంతో బాధితురాలు సైతం ఫిర్యాదు చేయలేదు.